మనం





# నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం । 16 । జూన్ । 2026 పేజీలు: 8


## అత్యవసర వేళ అండగా సీఎం సహాయనిధి



రూ.5 లక్షల ఎల్.ఓ.సి లేఖను అందజేసిన ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి.

2

# పల్స్ పోలియో విజయానికి శాఖల సమన్వయం అవసరం



- పల్స్ పోలియో, డీవార్మింగ్ డే, స్టాప్ డయేరియా క్యాంపెయిన్పై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం.
- జూన్ 28న పల్స్ పోలియోను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం.
- 199 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక.
- 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ
- గ్రామాల్లో ఓవర్హెడ్ ట్యాంకులకు ప్రతి రెండు రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేపట్టాలి.





*జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పల్స్ పోలియో, నేషనల్ డీవార్మింగ్ డే, స్టాప్ డయేరియా క్యాంపెయిన్ అమలుపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం సోమవారం ఐడీఓసీలో జరిగింది.*

2

## సీజనల్ వ్యాధులపై అవగాహనా లోపం

- పట్టి పీడిస్తున్న ప్రైవేట్ వైద్యం.
- ప్రయివేట్ ఆసుపత్రులపై ప్రభుత్వ పర్యవేక్షణ పెంచాలి.




2

## భిక్నూర్ ఇ-పంచాయతీ నిధులపై ఆర్టీఐ అస్త్రం

### సమాచారం కోరిన సామాజిక కార్యకర్త శ్రవణ్ కుమార్

*మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుండి మండల కార్యాలయానికి వస్తున్న నిధుల గూర్చి అలాగే గత ఐదేళ్లుగా జరిగిన ఇ-పంచాయతీ నిర్వహణ నిధులపై పారదర్శకత కోరుతూ సామాజిక కార్యకర్త, ఆర్టీఐ యాక్టివిస్ట్ బి. శ్రవణ్ కుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005 సెక్షన్ 6(1) ప్రకారం సోమవారం అధికారికంగా దరఖాస్తు సమర్పించారు. గత కొంతకాలంగా గ్రామ పంచాయతీల నిధుల కేటాయింపులు, ఖర్చులపై స్థానికంగా రకరకాల చర్చలు నడుస్తున్న నేపథ్యంలో, ప్రజా ప్రయోజనార్థం అసలైన నిజాలను బయటకు తీసేందుకు ఆయన ఈ ఆర్టీఐ అస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది.*



3

# అత్యవసర వేళ అండగా సీఎం సహాయనిధి

**- రూ.5 లక్షల ఎల్.ఓ.సి లేఖను అందజేసిన ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి.**

నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): నిరుపేద కుటుంబాలకు అత్యవసర వైద్య పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన సుంకం నిహాన్య అనారోగ్య సమస్యలతో హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స కోసం సుమారు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించడంతో బాధిత కుటుంబం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో రూ.5 లక్షల విలువైన ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) లేఖను ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు దూరమవుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరంలా మారిందని పేర్కొన్నారు. అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎల్.ఓ.సి లేఖ అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ధర్పల్లి మండల అధ్యక్షుడు బాల్రాజు, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.=





# పల్స్ పోలియో విజయానికి శాఖల సమన్వయం అవసరం

**- పల్స్ పోలియో, డీవార్మింగ్ డే, స్టాప్ డయేరియా క్యాంపెయ్న్ జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం.**

**- జూన్ 28న పల్స్ పోలియోను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం.**

**- 199 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక.**

**- 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ.**

**- గ్రామాల్లో ఓవర్హెడ్ ట్యాంకులకు ప్రతి రెండు రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేపట్టాలి.**



కామారెడ్డి, జూన్ 15 (మనం జిల్లా ప్రతినిధి): జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పల్స్ పోలియో, నేషనల్ డీవార్మింగ్ డే, స్టాప్ డయేరియా క్యాంపెయిన్ అమలుపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం సోమవారం ఐడీఓసీలో జరిగింది. జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లల కోసం 733 పోలియో బూత్లు, 36 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ బృందాలు, 199 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించినట్లు డీఎంహెచ్వో డాక్టర్ జె. వెంకట్ తెలిపారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జూలై 13న నేషనల్ డీవార్మింగ్ డే, జూలై 20న మాప్-అప్ రౌండ్ నిర్వహించి 1-19 ఏళ్ల పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ 16 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించి ఓఆర్ఎస్, జింక్ మాత్రల పంపిణీతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహనా లోపం

**- పట్టి పీడిస్తున్న ప్రైవేట్ వైద్యం.**

**- ప్రయివేట్ ఆసుపత్రులపై ప్రభుత్వ పర్యవేక్షణ పెంచాలి.**




ఆర్మూర్, జూన్ 15 (మనం న్యూస్): వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, వైరల్ ఫీవర్, డెంగ్యూ, చికున్గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రజలకు వచ్చే అవకాశం ఉంది అయితే ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, చిన్న లక్షణాలకే భయపడటం వల్ల ప్రైవేట్ ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రైవేట్ వైద్యం ప్రజలపై భారీ ఆర్థిక భారం మోపుతోంది. చాలా చోట్ల సాధారణ జ్వరానికే వేల రూపాయల పరీక్షలు, స్కాన్లు, మందులు సూచిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి వైద్యం చేయించుకునే పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు అవసరం లేని టెస్టులు చేసి రోగులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం తగ్గడం కూడా దీనికి ప్రధాన కారణంగా మారింది. వైద్యులు అందుబాటులో లేకపోవడం, సరిపడా మందులు లేకపోవడం, పరీక్షల సౌకర్యాలు తక్కువగా ఉండటంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.



స్కానింగ్ టెస్టులకు వేలల్లో ఖర్చు.




ప్రజలు అప్రమత్తం అవ్వాలి కుటుంబం లో ఒకరికి జ్వరం లేదా దగ్గు వస్తే అది అందరికి వస్తుంది కాబట్టి కొన్ని జాగ్రత్త లు పాటించాలి వైద్య నిపుణులు మాత్రం సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. పరిశుభ్రత పాటించడం, నిల్వ నీరు లేకుండా చూడటం, మరిగించిన నీరు తాగడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెబుతున్నారు. జ్వరం వచ్చిన వెంటనే భయపడకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఇక ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు సరైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు కోరుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజులు, పరీక్షలపై కూడా ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భిక్నూర్ ఇ-పంచాయతీ నిధులపై ఆర్టీఐ అస్త్రం

**సమాచారం కోరిన సామాజిక కార్యకర్త శ్రవణ్ కుమార్.**



భిక్నూర్, జూన్ 15 ( మనం న్యూస్ ): మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుండి మండల కార్యాలయానికి వస్తున్న నిధుల గుర్చి అలాగే గత ఐదేళ్లుగా జరిగిన ఇ-పంచాయతీ నిర్వహణ నిధులపై పారదర్శకత కోరుతూ సామాజిక కార్యకర్త, ఆర్టీఐ యాక్టివిస్ట్ బి. శ్రవణ్ కుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005 సెక్షన్ 6(1) ప్రకారం సోమవారం అధికారికంగా దరఖాస్తు సమర్పించారు. గత కొంతకాలంగా గ్రామ పంచాయతీల నిధుల కేటాయింపులు, ఖర్చులపై స్థానికంగా రకరకాల చర్చలు నడుస్తున్న నేపథ్యంలో, ప్రజా ప్రయోజనార్థం అసలైన నిజాలను బయటకు తీసేందుకు ఆయన ఈ ఆర్టీఐ అస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది.

**ఐదేళ్ల నిధులపై ఆరా..**

సామాజిక కార్యకర్త శ్రవణ్ కుమార్ సమర్పించిన దరఖాస్తు వివరాల ప్రకారం., భిక్నూర్ మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల నుండి మండల పరిషత్ కార్యాలయానికి గత 5 సంవత్సరాలుగా (అనగా 2020 నుండి 2026 ఆర్థిక సంవత్సరాల వారీగా) కేవలం ఇ-పంచాయతీ మెయింటెనెన్స్ కింద ఎంతెంత డబ్బులు వచ్చాయనే పూర్తి వివరాలను ధృవీకరించి ఇవ్వాల్సిందిగా కోరారు. గ్రామ పంచాయతీల డిజిటలైజేషన్ మరియు ఆన్లైన్ సేవల నిర్వహణ కోసం కేటాయించిన ఈ నిధుల్లో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగిందా లేదా అనే కోణంలో ఈ సమాచారం అత్యంత కీలకంగా మారనుంది.

**ప్రజా ప్రయోజనమే పరమావధి..**

ఈ సందర్భంగా దరఖాస్తుదారు బి. శ్రవణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ., 'గ్రామ పంచాయతీలకు వచ్చే ప్రతి పైసా ప్రజల సొత్తు. పాలనలో పారదర్శకత ఉన్నప్పుడే గ్రామాలు నిజమైన అభివృద్ధి సాధిస్తాయి. ఇ-పంచాయతీ మెయింటెనెన్స్ పేరుతో మండల కార్యాలయానికి అందిన నిధుల వివరాలు ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతో, ప్రజా ప్రయోజనార్థం ఈ సమాచారాన్ని ధృవీకృత నకళ్లతో సహా కోరడం జరిగింది. చట్టం ప్రకారం నిర్ణీత 30 రోజులలోపు పౌర సమాచార అధికారి దీనిపై స్పందించి పూర్తి నివేదిక అందజేయాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

మండలంలో ఇ-పంచాయతీ నిధుల లెక్కింపుపై ఆర్టీఐ దరఖాస్తు దాఖలు కావడం ఇప్పుడు స్థానిక రాజకీయ మరియు అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారులు చట్ట ప్రకారం స్పందించి పూర్తి సమాచారం ఇస్తారా, లేదా అనేది రాబోయే రోజుల్లో చూడాల్సి ఉంది.

---



# ఎరువుల సరఫరా పెంపునకు చర్యలు తీసుకుంటా

**- ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా యూరియా, డీఏపీ తదితర ఎరువుల సరఫరా పెంపు కోసం సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా అధ్యక్షుడు భూమారెడ్డి, కార్యదర్శి శేఖర్ నేతృత్వంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎరువుల సరఫరా పరిస్థితి, డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, యూరియా మరియు డీఏపీ సరఫరా పరిమితి పెంపు అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల అందుబాటుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే జిల్లాలో నకిలీ ఎరువుల బెడదను పూర్తిగా అరికట్టేందుకు వ్యాపారులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా వ్యాపారాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# యూరియా విషయంలో ఆందోళన వద్దు

మోర్తాడ్, జూన్ 15 (మనం న్యూస్ ): యూరియా విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, సరిపడా యూరియా నిలవలు అందుబాటులో ఉన్నాయని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. కృత్రిమ కొరతను నివారించడానికే ఆన్లైన్ విధానం అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. మోర్తాడ్ ప్రజా నిలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ., జిల్లాకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తీసుకున్న చొరవ వల్ల జిల్లాలో 39వేల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా నిలువలు ఉన్నాయన్నారు. 16 వేల మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని లక్ష యాభై వేల మంది రైతులు ఆన్లైన్ ద్వారా తీసుకున్నారని అన్నారు. ఇంకా 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని తెలిపారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం వల్ల సొసైటీలు భ్రష్టు పట్టుపోయి డిఫాల్ట్ గా మిగిలిపోయాయని, ఆ కారణంగా యూరియాని డబ్బులు కట్టి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని అందువల్లే రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. రైతులు వారి పరిధిలోని సొసైటీలకు వెళ్లి చైర్మన్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి డబ్బులు కట్టించాలని అన్నారు. డబ్బులు కట్టించే బాధ్యతను రైతులకు తీసుకుంటే సొసైటీలకు యూరియాను ఇప్పించే బాధ్యత తనదే అన్నారు. సొసైటీలు తమ చేతకాని విధానాన్ని ప్రభుత్వం మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, రైతులు ప్రతిపక్షాల మాటలకు మోసపోవద్దని కోరారు. ఆన్లైన్ విధానం ద్వారా రైతులకు ఇబ్బంది అవుతున్న మాట వాస్తవమేనని అవసరానికి మించి రైతులు యూరియా తీసుకువెళ్తే కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, రైతులు అర్థం చేసుకోవాలని కోరారు.

---

# భూస్వాముల అసైన్డ్ భూముల విక్రయాలపై విచారణ జరపాలి

**- తహసీల్దార్కు వినతి**



భిక్కనూర్ , జూన్ 15 ( మనం న్యూస్ ): భిక్కనూర్ గ్రామ పరిధిలోని ఎంఎస్ఎన్ కంపెనీ యాజమాన్యం ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూముల కొనుగోలు, విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ భిక్కనూర్ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు వేణు, రాజు, తహసీల్దార్ (ఎంఆర్ఓ)కు ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, భిక్కనూర్ గ్రామ పరిధిలోని కొన్ని అసైన్డ్ భూములు ప్రస్తుతం ఎంఎస్ఎన్ కంపెనీ ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. అసైన్డ్ భూములు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించరానివి అయినప్పటికీ, అవి ఎలా కంపెనీ చేతుల్లోకి వెళ్లాయనే అంశంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఎంఎస్ఎన్ కంపెనీ ఆధీనంలో ఉన్న భూములు నిజంగా అసైన్డ్ భూములేనా..? అయితే ఆ భూములు ఎవరికి కేటాయించబడ్డాయి..? కేటాయింపులు పొందిన అసలు లబ్ధిదారులు ఎవరు..? వారు భూములను స్వయంగా విక్రయించారా..? లేక ఇతరుల పేర్లపై మార్పిడి జరిగిందా..? అనే అంశాలపై అధికారికంగా దర్యాప్తు జరపాలని కోరారు. అలాగే, అసైన్డ్ భూముల బదిలీలు చట్టబద్ధంగా జరిగాయా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. భూముల యాజమాన్య మార్పిడి ప్రక్రియలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగి ఉంటే వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు. గ్రామ ప్రజల హక్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ దృష్ట్యా ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీయాలని, అసైన్డ్ భూముల కొనుగోలు-విక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రాన్ని గ్రామానికి చెందిన వేణు, రాజు తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించారు.

---



# మా స్థలాన్ని మాకు ఇప్పించండి

మోర్తాడ్, జూన్ 15 ( మనం న్యూస్): మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా తాము కల్లు విక్రయాలు జరుపుకున్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకుందామని స్థానిక గౌడ సంఘం ఆరోపించింది. సోమవారం మోర్తాడ్ మండల అభివృద్ధి అధికారి కలిసి వినతి పత్రాన్ని గౌడ సంఘం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ., 1960 నుండి తాము ఆ స్థలంలో కల్లు అమ్మకాలు జరుపుతున్నామని, దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా ఉన్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అట్టి స్థలంలో దాని పక్కనే ఉన్న ఇత్తడి శేఖర్ ఆనంద్ రాజేందర్లు ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ఫిర్యాదుల పేర్కొన్నారు. తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని వారు ఆ వినతిపత్రంలో ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కిషన్ గౌడ్ తో పాటు గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం పెరగాలి

- ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్.
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అడిషనల్ కలెక్టర్ వై.వి. గిరి.
- విపత్తులో సహాయక, రక్తదాన శిబిరాల్లో రెడ్ క్రాస్ సేవలు కీలకం.. ఆర్కే సీఈఓ డాక్టర్ జైపాల్ రెడ్డి.




కామారెడ్డి, జూన్ 15 (మనం న్యూస్): భారతదేశంలో అతిపెద్ద స్వచ్ఛంద సేవా సంస్థగా గుర్తింపు పొందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ ఆర్ సి ఎస్) సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్ సోమవారం కామారెడ్డి పట్టణంలోని ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మే 15 నుంచి జూన్ 15 వరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం చివరి రోజు సందర్భంగా ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ వై.వి. గిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఆర్కే విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి పాట్రన్ మెంబర్షిప్ తీసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని అభినందించారు. సభ్యత్వ నమోదుకు చివరి రోజు కావడంతో విద్యార్థులు, యువత, సమాజ సేవకులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి సభ్యత్వం పొందాలని, జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.




### రెడ్ క్రాస్ సేవలు సమాజానికి ఎంతో అవసరం

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న జిల్లా లేబర్ ఆఫీసర్ శశికుమార్ మాట్లాడుతూ., రెడ్ క్రాస్ సేవలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆర్కే విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ., రూ.1,000 చెల్లించి లైఫ్టైమ్ మెంబర్షిప్, కేవలం రూ.250తో జీవితకాల అసోసియేట్ సభ్యత్వం పొందే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. విపత్తుల సమయంలో సహాయక చర్యలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్యవసర సేవల్లో రెడ్ క్రాస్ పాత్ర అసామాన్యమని, సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం పెరగాలని కోరారు. విద్యార్థులు సామాజిక బాధ్యతగా సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న, దత్తాత్రి, నవీన్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, కేజీ టు పీజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆన్లైన్, ఆఫ్లైన్ విధానాల్లో సభ్యత్వ నమోదు చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## మైనార్టీ గురుకుల కళాశాలలో మొరం రోడ్డు పని ప్రారంభం

రెంజల్, జూన్ 15 (మనం న్యూస్): రెంజల్ మండల కేంద్రంలో గల మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మొరం రోడ్డు పనికి ప్రారంభం జరిగింది. మండలంలో విద్యార్థులు, ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ రోడ్డు పనిని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తిరుపతి లలిత బుజ్జి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు,

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానసా రాకేష్, వార్డ్ మెంబర్లు సిరాజుద్దీన్, షబ్బీర్, కరికేల్లి గంగన్న, శ్రీకాంత్, రవి పాల్గొని పనుల ప్రారంభానికి సహకరించారు.

అలాగే గ్రామ పెద్దలు ఇందిరా రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, ఆసాని అనిల్, మేకల సాయి పాల్గొన్నారు. మండల అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ రోడ్డు పని త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## సామాజిక సేవాకు రెడ్క్రాస్ గొప్ప వేదిక

- రెడ్క్రాస్ ప్యాట్రన్ సభ్యత్వం తీసుకున్న కిషోర్ కుమార్.
- విద్యా, ధార్మిక రంగాల్లో కిషోర్ కుమార్ చేస్తున్న సేవలను కొనియాడిన కలెక్టర్.
- సభ్యత్వ నమోదుకు సహకరిస్తున్న పీఆర్టీయూ నాయకత్వానికి ప్రశంసలు.



కామారెడ్డి, జూన్ 15 (మనం జిల్లా ప్రతినిధి): జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపుతో నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల కిషోర్ కుమార్ రూ.25 వేల విరాళం చెల్లించి రెడ్క్రాస్ ప్యాట్రన్ సభ్యత్వం పొందారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా సభ్యత్వ ధ్రువపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ విద్యా, ధార్మిక రంగాల్లో చేస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు రెడ్క్రాస్ గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకుంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను, వారిని ప్రోత్సహిస్తున్న పీఆర్టీయూ నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ రెడ్క్రాస్లో సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్వై గిరి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ డా. శశికుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అల్లాపూర్ కుశాల్, ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 93 వినతులు స్వీకరణ

కామారెడ్డి, జూన్ 15 (మనం ప్రతినిధి): జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, గృహాలు, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 93 వినతులు అందాయి. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్వీ గిరి, జెడ్పీ సీఈఓ చందర్తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తరచూ విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న ముళ్లంగి గ్రామ ప్రజలు


- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీఎస్ఎన్పీడీసీఎల్ అధికారులకు గ్రామ పంచాయతీ వినతి.

నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): డిచ్పల్లి మండలంలోని ముళ్లంగి గ్రామంలో తరచూ విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్లు టీఎస్ఎన్పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ హరిచంద్ర నాయక్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గత కొన్ని నెలలుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, దీంతో గృహ వినియోగదారులు, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో విద్యుత్ కోతలు అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అలాగే గ్రామానికి సంబంధించిన ఏజీఎల్ (ట్రాన్స్ఫార్మర్) సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల విద్యుత్ లోడ్ పెరిగిన సమయంలో సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయని వివరించారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు సౌకర్యాలు కల్పించి, విద్యుత్ సరఫరాను మెరుగుపర్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజల సౌకర్యార్థం విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముళ్లంగి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# యూరియా యాప్ తొలగించాలి

- తహసీల్దార్కు బీజేపీ నేతల వినతిపత్రం.
- రైతుల సమస్యల పరిష్కారానికి డిమాండ్




రెంజల్, జూన్ 15 (మనం న్యూస్): బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు యూరియా యాప్ను ఆన్లైన్ నుండి తొలగించాలని కోరుతూ రెంజల్ మండల కేంద్రంలో సర్పంచ్ క్యాతం యోగేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ శ్రవణ్ కుమార్కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., యూరియా పంపిణీ కోసం తీసుకువచ్చిన యాప్ విధానం వల్ల గ్రామీణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యల కారణంగా అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటలపై ప్రభావం పడుతున్నదని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని యాప్ను రద్దు చేసి ప్రత్యేకంగా ఎరువుల పంపిణీ విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు సులభంగా, వేగంగా యూరియా అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగంలో సమస్యలు తగ్గించేలా పాలసీ మార్పులు అవసరమని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు డిజిటల్ విధానం కంటే ప్రత్యక్ష సరఫరా విధానం మరింత ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్యాతం యోగేష్, ఇర్ల రాజు, గాండ్ల ప్రసాద్, అనిల్, బాబాజీ శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# భీమ్గల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

భీమ్గల్, జూన్ 15 (మనం న్యూస్): రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న యూరియా యాప్ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, యూరియాను విరివిగా రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా పంపిణీ యాప్ను తక్షణమే రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న సులభమైన విధానాన్ని పునరుద్ధరించాలని భీమ్గల్ మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొనకంటి నరసయ్య డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు యూరియా యాప్ వల్ల ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు అండగా ఉండటానికి సోమవారం భీమ్గల్ మండల కేంద్రంలోని సుమంగళి చౌరస్తాలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దొనకంటి నరసయ్య మాట్లాడుతూ., కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కొత్త కొత్త నిబంధనలతో వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. యూరియా పంపిణీ కోసం ప్రవేశపెట్టిన యాప్ రైతులకు ఉపయోగకరంగా కాకుండా భారంగా మారిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేమి, సర్వర్ సమస్యలు, యాప్ పనిచేయకపోవడం వంటి కారణాలతో రైతులు గంటల తరబడి ఎరువుల కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పంటకు




కావాల్సినంత యూరియా ఇవ్వకుండా సగానికి కుదించి ఇవ్వడం వల్ల రైతుల పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వ్యవసాయ పనులు అత్యంత కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కోసం రైతులు కార్యాలయాలు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సి రావడం దురదృష్టకరమన్నారు. రైతు అవసరాలను దృష్టిలో పెట్టుకుండా తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా రైతు వ్యతిరేకమని ఆయన మండిపడ్డారు. గతంలో కే సీ ఆర్ ప్రభుత్వంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు పొందేవారని, ఇప్పుడు యాప్ పేరుతో అనవసరమైన నిబంధనలు విధించి రైతులను మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమయానికి అందించడంతో వ్యవసాయ రంగం బలోపేతం అయిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా యూరియా యాప్ను వెంటనే రద్దు చేసి, ఎరువుల పంపిణీని పాత విధానంలో కొనసాగించాలని,రైతులకు యూరియా విరివిగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జడ్పీటీసీలు చౌటుపల్లి రవి, కౌన్సిలర్లు బొదిరె నరసయ్య, మల్లెల ప్రసాద్, నాయకులు రాజు నాయక్, మూత లింబాద్రి, సిద్ధపల్లి రాములు, సాగర్, తోట లింగం తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని యూరియా యాప్కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు.





# ఈసీ మెంబర్కు సన్మానం

బీబీపేట్, జూన్ 15 (మనం న్యూస్): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కామారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నూతనంగా ఎన్నికైన ముదాం శివ శంకర్ ను సోమవారం బిబిపేట మండల కేంద్రంలో విలేకరులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ విలేకరుల హక్కులపై కృషి చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బిబిపేట విలేకరులు బాబు, రవి, సింహం, రవి, నవీన్, స్వామి పాల్గొన్నారు.

# బీబీపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా వడ్ల నవీన్ ఎన్నిక



బీబీపేట్, జూన్ 15(మనం న్యూస్): బీబీపేట మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా వడ్ల నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా మంగళి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కన్న రవి, ముఖ్య సలహాదారునిగా దాసరి బాబు, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ విలేకరుల హక్కులకై కృషి చేస్తానని అన్నారు. అంతరం నూతన కార్యవర్గాన్ని మండల విలేకర్లు సన్మానం చేశారు.కార్యక్రమంలో విలేకరులు కమ్మరి సింహం, చింతకింది సిద్ధరాములు, శ్యాగ రాజు , దోమల స్వామి పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలలో హిందీభాషా సంభాషణ శిక్షణ శిబిరం

రుద్రూర్, జూన్ 15 (మనం న్యూస్): కేంద్రీయ హిందీ సంస్థాన్ హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకై హిందీ భాష సంభాషణ శిక్షణ శిబిరాన్ని రుద్రూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ప్రారంభించారు. హిందీ భాష ప్రాముఖ్యతను పెంపొందించుటకై విద్యార్థుల్లోని హిందీ సంభాషణను మెరుగు పరిచేందుకు ఈ శిక్షణ శిబిరం ఈ నెల 15.06-2026 నుండి 19.06.2026 వరకు కొనసాగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ శ్యామల పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాల్లో మొదటిసారిగా ఈ శిబిరం కేజీబివి, రుద్రూర్ నందు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంసింగ్, రిజనల్ డైరెక్టర్ భాస్కర్ క్రిష్ణజీ రూబే, హిందీ లెక్చరర్ డా.దీపేష్ వయాస్, పవం షేక్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.



# గోమాంస విక్రయాలను వెంటనే నిలిపివేయాలి

**- తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన మైనార్టీలు.**

రుద్రూర్, జూన్ 15 (మనం న్యూస్) : రుద్రూర్ మండల కేంద్రంలో పశుమాసం మార్కెట్ వద్ద అపరిశుభ్రమైన గో మాంసం విక్రయాలు చేస్తున్నారని, వెంటనే గో మాంసం విక్రయాలను నిలిపివేయాలని మైనార్టీలు సోమవారం తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., పశుమాంసం మార్కెట్ వద్ద డాక్టర్ సర్టిఫికెట్ లేకుండా అపరిశుభ్రమైన గోమాంసాన్ని విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. పశుమార్కెట్ (కమేళ) నందు కుక్కలు, పందులు సంచరిస్తు బల్లల పైన నాకడం వాటిపైనే మాంసం పెట్టి విచ్చల విడిగా పెద్ద ఎత్తున విక్రయాలు జరుపుతున్నారని, దీనివలన దుర్వాసన వెదజల్లి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. కావున గోమాంసం విక్రయిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోని, గో మాంసం విక్రయాలను నిలిపివేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

# ప్రజావాణిలో 16 ఫిర్యాదుల స్వీకరణ

**- సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు అదనపు డీసీపీ ఆదేశం.**

నిజామాబాద్ , జూన్ 15 (మనం జిల్లా ప్రతినిధి):ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం 16 ఫిర్యాదులను స్వీకరించినట్లు నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ తెలిపారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఆయన స్వయంగా విన్నారు. అందిన అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సీఐలతో ఫోన్లో మాట్లాడి సమస్యల ప్రస్తుత స్థితిని తెలుసుకుని తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ., ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించడం, పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడం జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలకు సంబంధించిన మొత్తం 16 ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు పంపినట్లు వెల్లడించారు.

# వృద్ధుల హక్కులపై అవగాహన

**- ప్రభుత్వ వృద్ధాశ్రమంలో న్యాయ సేవా సంస్థ వృద్ధుల హక్కులపై అవగాహన.**
**- ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మాయా సురేష్**
**- వృద్ధుల పోషణ పిల్లల చట్టబద్ధ బాధ్యత, నిర్లక్ష్యం, వేధింపులు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం.**
**- వృద్ధుల హక్కుల పరిరక్షణకు 2007 చట్టం కీలకమన్న న్యాయవాది సిద్దరాములు.**





కామారెడ్డి, జూన్ 15 (మనం న్యూస్): ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మాయా సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారి అనుభవాలు యువతకు అమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. 'తల్లిదండ్రులు మరియు వృద్ధ పౌరుల పోషణ, సంక్షేమ చట్టం-2007' ప్రకారం పిల్లలు తమ తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని వివరించారు. నిర్లక్ష్యం, వేధింపులు ఎదురైనప్పుడు వృద్ధులు న్యాయ సేవా సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. న్యాయవాది సిద్దరాములు మాట్లాడుతూ వృద్ధుల హక్కుల పరిరక్షణకు 2007 చట్టం కీలకమని, పోషణ కోసం సంబంధిత ట్రైబ్యునల్ను ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మువ్వ శ్రీనివాస్ రావు ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ విజయ్ కుమార్, సిబ్బంది సాయి కృష్ణ, వృద్ధాశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

# నీలా గ్రామ పాఠశాలలో శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన సర్పంచ్





రెంజల్ జూన్ 15 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్ పాఠశాల ఆవరణలో ప్రత్యేక శానిటేషన్ మరియు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తిరిగి పాఠశాలకు హాజరయ్యే సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా శుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రపరిచి, చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. మురుగు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను తొలగించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే పాఠశాలలోని బాత్రూమ్లను స్వయంగా పరిశీలించి, వాటి పరిస్థితిని అంచనా వేసి వెంటనే మరమ్మతులు మరియు శుభ్రత పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి పాఠశాలలోనూ పరిశుభ్రతను ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సర్పంచ్ క్యాతం యోగేష్ సూచించారు. గ్రామ అభివృద్ధిలో విద్యా వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సహకరించారు. గ్రామంలో విద్యా వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# కూనేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టెస్ట్ బుక్స్ పంపిణీ

**- విద్యా ప్రోత్సాహానికి శ్రీకారం**



రెంజల్, జూన్ 15 (మనం న్యూస్): కూనేపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం రోజు విద్యార్థులకు టెస్ట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడం మరియు పరీక్షల పట్ల ఆసక్తి పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈరబోయిన మల్లేష్ పాల్గొని విద్యార్థులకు టెస్ట్ బుక్స్ అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు.

ఉపసర్పంచ్ మాధగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వసంత, సందీప్ పాల్గొన్నారు. గ్రామంలో విద్యా రంగ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# భిక్కనూర్‌లో యూరియా సెగ...

**- 10 నిమిషాల్లోనే ఖాళీ..**
**రైతుల తీవ్ర ఆందోళన.**



భిక్కనూర్, జూన్ 15 ( మనం న్యూస్ ): తమ పొలాలకు ప్రాణాధారమైన యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులకు మళ్లీ నిరాశే ఎదురైంది. మండల కేంద్రమైన భిక్కనూర్ లో సోమవారం యూరియా కొరతను నిరసిస్తూ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కథనంలోకి వెళ్తే.., భిక్కనూర్ మండలానికి సుమారు 500 యూరియా బస్తాలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు యూరియా బుకింగ్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే, బుకింగ్ మొదలైన కేవలం 10 నిమిషాల్లోనే 500 బస్తాల కోటా పూర్తయిపోయినట్లు అధికారులు ప్రకటించడంతో రైతులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురయ్యారు.

గంటల తరబడి లైన్లలో నిల్చున్నా, ఆన్లైన్ బుకింగ్ కోసం వేచి చూసినా ఫలితం దక్కకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


**రైతుల ఆవేదన.. ప్రభుత్వాన్ని నిలదీస్తున్న అన్నదాతలు....**


పంటలు చేతికి వచ్చే కీలకమైన ఈ సమయంలో యూరియా అందకపోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ‘పంటలు వేసుకునే ఈ పీక్ టైమ్లో ఇలా యూరియా కొరత ఏర్పడితే మేము ఎట్లా బతకాలి..? కేవలం పది నిమిషాల్లోనే వందల బస్తాలు ఎలా మాయమవుతాయి? ల్యాప్టాప్లు, ఫోన్ల ముందు కూర్చునే లోపే స్టాక్ అయిపోయిందని చెబితే సామాన్య రైతులకు యూరియా ఎలా అందుతుందని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీస్తున్నారు. భిక్కనూర్ మండల రైతులకు అవసరమైన మేర పూర్తి స్థాయిలో యూరియా బస్తాలను వెంటనే సరఫరా చేయాలి.బుకింగ్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకుండా, నిజమైన లబ్ధిదారులైన రైతులందరికీ ఎరువులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

వానాకాలం సీజన్ ఊపందుకుంటున్న తరుణంలో ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి భిక్కనూర్ ప్రాంతంలో యూరియా కొరతను తీర్చాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# డ్యూటీ సమయానికి రాని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

**- ఉదయం 10:50 అయినా రాని అధికారులు.**
**- ప్రజలకు సేవల్లో అంతరాయం.**
**- ప్రతిరోజూ ఇదే పరిస్థితి - మారని కార్యాలయ తీరుపై ప్రజల ఆగ్రహం.**





రెంజల్, జూన్ 15 (మనం న్యూస్): రెంజల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమయపాలన పూర్తిగా గాలికి వదిలేశారని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించకపోవడం, సమయానికి హాజరు కాకపోవడం వల్ల కార్యాలయంలో రోజంతా ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండల ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

మండలానికి కీలక అధికారిగా ఉన్న ఎంపీడీవో వారణాసి కమలాకర్తో పాటు కార్యాలయ సిబ్బంది, అన్వార్ పనితీరు పట్ల కూడా స్థానికంగా ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కార్యాలయ నిర్వహణలో సమయపాలన, హాజరు, ప్రజా సేవల విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎప్పుడు కార్యాలయానికి వచ్చినా అదే పరిస్థితి కనిపిస్తోందని, డ్యూటీ సమయాన్ని పాటించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల వాసులు చెబుతున్నారు. ఫోన్ ద్వారా సమాచారం కోరితే టూర్లో ఉన్నాం అనే కారణంతో కాల్ డిస్కనెక్ట్ చేస్తున్నారని కూడా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. పై అధికారుల పూర్తి సహకారంతోనే ఈ పరిస్థితి కొనసాగుతోందా లేక నిజంగానే కార్యాలయ నిర్వహణలో లోపాలున్నాయా అనే ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఎంపీడీవో కార్యాలయ పనితీరును సమీక్షించి, సమయపాలన పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన 5 టౌన్ ఎస్హెచ్ఓ సందీప్

నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): ఇటీవల నిజామాబాద్ 5 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన కే. సందీప్ సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన భేటీలో ఎస్హెచ్ఓ సందీప్ ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజా సేవల నిర్వహణపై స్వల్పంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ., ప్రజలకు పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవాభావంతో పనిచేయాలని ఎస్హెచ్ఓ సందీప్కు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో స్పందనతో వ్యవహరిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ట్రాక్టర్ బోల్తా పడి యువ డ్రైవర్ మృతి

నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): జక్రన్పల్లి మండలంలోని పద్కల్ తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. ఎస్ఐ జి మహేష్ వివరాల ప్రకారం., పద్కల్ తండాకు చెందిన బదావత్ పవన్ కళ్యాణ్ (26) ట్రాక్టర్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ట్రాక్టర్ యజమాని కుటుంబ సభ్యుల సూచన మేరకు కల్టివేటర్ తీసుకురావడానికి ట్రాక్టర్తో వెళ్లినట్లు తెలిసింది. రాత్రి సుమారు 11 గంటల సమయంలో పద్కల్ తండా సర్వీస్ రోడ్డుపై ట్రాక్టర్ వెళ్తుండగా, రోడ్డుకు పక్కన ఉన్న రాళ్లు చీకటిలో కనిపించకపోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పవన్ కళ్యాణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి బదావత్ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జక్రన్పల్లి ఎస్ఐ జి. మహేష్ తెలిపారు. యువకుడి మృతితో పద్కల్ తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా ఐల రాజలింగం నియామకం

**- ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షుడు**

నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని కాలూర్-ఖానాపూర్ డివిజన్ నంబర్-1 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఐల రాజలింగం సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన భేటీలో ఎమ్మెల్యే రాజలింగంను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అధ్యక్ష పదవికి ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసిన రాజలింగం, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్నినిలబెట్టుకుంటూ పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ., కాంగ్రెస్ పార్టీ కోసం దీర్ఘకాలంగా అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా విశేష సేవలందించిన రాజలింగం భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నంబర్-1 కార్పొరేటర్ అగ్గు భోజన్న, నాయకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఆడియోపై పోలీసులకు ఫిర్యాదు

- సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆడియో పూర్తిగా నకిలీదన్న గీరెడ్డి మహేందర్ రెడ్డి.
- కామారెడ్డి డీఎస్పీ, పట్టణ ఎస్హెచ్వోలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు.
- షబ్బీర్ అలీతో ఎలాంటి ఫోన్ సంభాషణ జరపలేదని మహేందర్ రెడ్డి స్పష్టం.
- నకిలీ ఆడియో సృష్టించిన వారిని, ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- తప్పుడు ప్రచారం వల్ల తన ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగిందని ఆవేదన.



కామారెడ్డి, జూన్ 15 (మనం న్యూస్): సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న ఆడియో పూర్తిగా నకిలీదని తన పేరుతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ పేరును ఉపయోగిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త గీరెడ్డి మహేందర్ రెడ్డి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కామారెడ్డి డీఎస్పీ, పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్వోలకు ఫిర్యాదు చేశారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తాను, షబ్బీర్ అలీతో ఎలాంటి ఫోన్ సంభాషణ జరపలేదని స్పష్టం చేశారు. జూన్ 12 నుంచి తాను, షబ్బీర్ అలీ ఫోన్లో మాట్లాడినట్లు, పార్టీ నాయకులను విమర్శించినట్లు, మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు నకిలీ ఆడియో సృష్టించి వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్లలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సోషల్ మీడియాలో దూషణలు, బెదిరింపులు

ఈ ప్రచారం కారణంగా సోషల్ మీడియాలో దూషణలు, బెదిరింపులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో విభేదాలు సృష్టించి నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీయడమే ఈ కుట్ర వెనుక ఉద్దేశమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ ఆడియోను రూపొందించి ప్రచారం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.





# విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజుపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి

- విద్యార్థి సంఘం జేపీసీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డిఓ, ఏసీపీ లకు వినతి పత్రం.

బోధన్, జూన్ 15 (మనం న్యూస్): విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజుపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని సోమవారం జేపీసీ నాయకులు బోధన్ ఆర్డిఓ, ఏసీపీలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ బాలరాజు మాట్లాడుతూ., బోధన్ పట్టణంలోని చైతన్య వొకేషనల్ కళాశాల యాజమాన్యం విద్యార్థులు నుండి అధిక ఫీజులు ల్యాబ్ మరియు ఎగ్జామ్స్ పేజీలు కూడా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, చదువు పూర్తి అయిన విద్యార్థులకు టీసిలు, మెమో లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజు కు సదురు విద్యార్థులు తెలియజేయడంతో నాగరాజు పలు మార్లు కళాశాల యాజమాన్యం తో మాట్లాడడం జరిగిందని, కళాశాల యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోవడం, పైగా నాగరాజుతో దురుసుగా మాట్లాడడం మా కళాశాల మా ఇష్టం నువ్వెవరు మాకు చెప్పడానికి అని అన్నారని, నాగరాజు పై తప్పుడు కేసులు పెట్టడం జరిగిందని, ఈ విషయం పైన అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి చైతన్య వొకేషనల్ కళాశాల యాజమాన్యం కిషన్ పై తగు చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. నాగరాజుపై కేసులు తప్పుడు కేసులు ఎత్తివేయాలి అని అన్నారు. వినతి పత్రం సమర్పించించిన వారిలో జేపీసీ నాయకులు ఎం డి మోసిన్, తల్లారి సంజయ్, ప్రతాప్, రాజన్న, కిరణ్, మోహన్, రాజు, శ్రీనులు ఉన్నారు.



# పత్రిజీ జన్మస్థల్‌లో అమావాస్య ద్యాన కార్యక్రమం





బోధన్, జూన్ 15 (మనం న్యూస్): బోధన్ పట్టణం శక్కర్ నగర్ లోగల శ్రీ సావిత్రి దేవి ధ్యాన పిరమిడ్ పత్రిజీ జన్మస్థల్ లో సోమవారం అమావాస్య ద్యాన కార్యక్రమం ట్రస్టు సభ్యులు లత లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం అయిదు గంటల వరకు కార్యక్రమం కొనసాగింది వివిధ గ్రామాల నుండి ధ్యానులు చిన్నారులు కేంద్రానికి వచ్చి ద్యానం చేశారు. పిరమిడ్ మాస్టర్లు లత లక్ష్మణ్ లు ధ్యానులకు ఆత్మ జ్ఞాన సందేశం అందజేశారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందరికీ ద్యానం అవసరం అనే పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు పుష్ప, దీప, లత తదితరులు పాల్గొన్నారు.

# హోమియోపతి వైద్య విద్యలో ప్రతిభ చాటిన వాల్గోట్ కాలన్ యువకుడు

- బీహెచ్ఎంఎస్ పట్టా సాధించిన మహమ్మద్ అబ్బాస్ అలీ.



నిజామాబాద్ రూరల్, జూన్ 15 (మనం న్యూస్): గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు వైద్య విద్యలో ప్రతిభ కనబర్చి డాక్టర్గా అవతరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన లియాకత్ అలీ కుమారుడైన  మహమ్మద్ అబ్బాస్ అలీ హోమియోపతి వైద్య విద్యలో బీహెచ్ఎంఎస్ పట్టాను విజయవంతంగా సాధించారు. అబ్బాస్ అలీ, గ్రామానికి చెందిన లియాకత్ కుమారుడు. కర్ణాటక రాష్ట్రంలోని శ్రీ సత్య సాయి మెడికల్ కళాశాలలో హోమియోపతి వైద్య విద్యను అభ్యసించి డిగ్రీ పూర్తి చేశారు. ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ఆయనకు పట్టా ప్రదానం చేసింది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అబ్బాస్ అలీ పట్టుదలతో చదివి వైద్యుడిగా అర్హత సాధించడం గ్రామ యువతకు ఆదర్శంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో వైద్య రంగంలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.